పెట్టిందేలేదు నేటికీని. అది కత్తితో సహా గగన కుసుమం అయిపోయింది.

ఎవరన్నా గుడిసెకాడకొచ్చి లోపల "కోడిపుంజు అమ్మన్న వుందా?" అని ఆకాణ్ణుంచి అడిగితే, గుడ్డిరివటయ్య గుమ్మంలో కూకుడుండి గ్రుడ్లుఉమడం తప్పిస్తే. మఱి ఆ ప్రాంతంలో కసి, అక్కసు మటుమాయమై పోయినాయి! పేకాటకూడా నాటితో అందఱూ విరమించేసుకున్నారు!

.... .... .... .... ....

## మానినీ చిత్తచోరుడు

ఈగాధ ద్వాపరయుగంనాటిది. శ్రీకృష్ణ భగవానుణ్ణి గుఱించి వ్రాసింది. ఇందులో కొంతమట్టుకు ప్రేమ ద్యోతకం అవుతూ వుంటుంది. కొంతమట్టుకు విరక్తి ద్యోతకం అవుతూవుంటుంది.

—ఋషులంతా స్త్రీలై భూలోకంలో సత్యభామాదుల క్రిందనూ, గోపికలక్రిందనూ జన్మించి, శ్రీకృష్ణభగవానుల వారితో అష్టైశ్వర్యాలూ, ఇష్టభోగాలూ అనుభవిస్తూ పిల్లాజెల్లాతో వ్రేపల్లెవాడలో వర్ధిల్లుతూవున్న సమయంలో శ్రీనారదమహర్షులు, వైకుంఠంలో వొంటిగా ఋషినామంతో వుండలేకపోతేనేం, శ్రీకృష్ణులవారి రసికత్వం గ్రహించాలనే కుతూహలంచేతనైతే నేం, తానూ వొకస్త్రీగా భూలోకంలో జన్మించి, సాక్షాన్నారాయణ మూర్తియైన యయ్యాదవకుంజరునితో సంసారం సాగించాలని గట్టి కోరిక తనలో వుదయింప జేసికొన్నాడు.

మహర్షులకు కోరికపుట్టిందీ అంటే తీరింది అన్నమాటే!

ఏలాగో వోలాగు భూలోకంలో స్త్రీగాపుట్టారు నారదుల వారు. కాని భూలోకంలో జన్మించడం అంటే జన్మతోనే పదవి అనేది ఒకటుంటుంది చూడండి! ఏ పదవి ఈ స్త్రీగా జన్మించిన నారదులవారు ఆక్రమించడం? అప్పటికప్పుడే రాధ, రాధ తరువాత రుక్మిణి, ఆమె తరువాత సత్యభామ ఇలాగ్గా అష్ట మహిషులు, అరవై వేలగోపికలు కృష్ణుని చెట్టుబట్టి, ఉట్లుకొట్టి పట్టుకొచ్చే వెన్నముద్దల దగ్గర్నుంచీ పాల్గొంటూ వున్నారు. ఈ కొత్తగా జన్మించిన నారదస్త్రీకి తావెక్కడ? ఏలా తనను తెలుసుకుంటాడు శ్రీ కృష్ణభగవానులు? ఏలా తనను అనుగ్రహి స్తాడు శ్రీ పరమాత్మప్రభువులు?

అంచేత ఎక్కడా తావులేక "నారదస్త్రీ" అనగా స్త్రీ వేషమునవున్న నారదులవారన్నమాట—ఆమె యాదవపురంలో గట్టుకింద ఓ గంగరావిచెట్టుంటే ఆ చెట్టుకింద మకాం పెట్టుకుని, అక్కడక్కడ పట్నమమ్మట తెల్లాఅడంతోనే జోలేసుకుని బిచ్చానిగ్గాను బయల్దేఱుతూ వుండేది. చేతిలో చితారు మోగించేది. చితారుపాటకుతోడు గాత్రంకూడా కలిపేది. గాత్రానికితోడు కాస్తోకూస్తో అభినయించేది. రాత్రిపడేతలికి ఆ చెట్టుకిందకు చేరుకుని వొక్కర్తే కాలక్షేపంగా కాలం గడుపుతూ వుండేది.

క్రమక్రమంగా వయసొచ్చింది. ఆడదానికి ఏంకావాలి వయసుంటే? అదే అందం! అదే అదృష్టం! పట్నంలో ఎక్కే గుమ్మం దిగేగుమ్మంగా ముష్టెత్తుకుంటూ శ్రీకృష్ణభగవానుల వారికి ఆ వయసప్పుడు ఓ రోజున ఎదురైంది. ఎదురౌతూ పాడిందికదా! ఎవరో అనుకుంది!

"చెట్టువేఱు నూపురం - చెట్టుకొమ్మ గోపురం,
గట్టుకింద కాపురం - గట్టుమీదనే పురం:—"

అని పాడింది.

శ్రీకృష్ణభగవానులకు ఆ పాట అదేదో కొత్తపాటలాగు వినబడింది. జవ్వని ముఖంకేసి చూచినాడు. సరికొత్తజవ్వనం ఊఁ కవ్విస్తూవుంది: మెళ్లో సల్లపూసన్నాలేదు. చేతుల్ని అంత కంటే ఏమీలేవు. కాళ్ళను అసలే ఏమీలేవు. వాళ్ళే పిల్ల! పిల్లే వాళ్ల!

అదో విశేషం, చేతిలో చితారువుంది. కంఠం వినసొంపుగా వుంది. చూచారు శ్రీకృష్ణపరమాత్మలవారు. చూచి కిమన్నాస్తి ఏమీ పలుకరించకుండానే తమదారిని వెళ్ళిపోయినారు.

ఆ ఘడియే ప్రారంభం జవ్వనికి వియోగాంకురం మొల కెత్తడం. మాపటికి చెట్టుకిందకు చేరుకుంది. చెట్టుకింద శుభ్రంగా తుడిచేసింది. చలికి తన కాళ్ల తన జోలిబొంతలో కుక్కుకుని, పండుకుంది చెట్టుమొదలు తలాడగా చేసుకొని; కాస్తదూరంలో పైబడ్డవేఋంటే ఆ వేఋ తన్నుతూ అదేతాళపులయగా. చెట్టు కొమ్మలకేసి చూస్తూ చితారుమోగించి పాడుతూంది:

" చెట్టువేఋ నూపురం - చెట్టుకొమ్మ గోపురం
గట్టుకింద కాపురం - గట్టుమీదనే పురం. "

అని—

సరిగ్గా ఆవేళప్పుడు శ్రీకృష్ణభగవానుల వారేంచేస్తూ వున్నారూ అంటే రుక్మిణీదేవితో సొగటాలపాళీ ఆడుతూ వున్నారు. ఆడుతూ ఆడుతూ ఆట ఆపి ఆమెతో " ఇప్పుడే వస్తాను, వుండు " అన్నారు. రుక్మిణితో అలాచెప్పి వెళ్ళిపోతూ వుండడం స్వామికి పరిపాటే. అది అప్పటికప్పుడే ఏ లక్షపదివేల పదకొండో పర్యాయమో అయియుంటుంది. అంచేత ఆమె భర్తను ఎక్కడికనిగాని ఎందుకనిగాని అడగలేదు.

* * * * *

నారదస్త్రీ పాడుతూ పాడుతూ శ్రీకృష్ణభగవానులవారి అడుగుల సవ్వడి చీకట్లో విన్నదై పాట ఆపి "ఎవరు మహానుభావులు ?" అని పృచ్ఛించింది. "నేను నారదమహర్షిని" అన్నారు స్వామివారు. "కారు ! కారు ! నారదమహర్షులుకారు. నారదమహర్షులే అవితే ఏది యీ చితారు మోగించిపాడండి" అంది జవ్వని.

స్వామి అపూర్వంగా సరిగ్గా నారదులవారెలా వాయించీవారో అలావాయించారు, ఆ జవ్వని చేతిలోనుంచి చితారందిపుచ్చుకుని.

జవ్వని ఆప్యాళంగా అంది "నా హృదయాన్ని కరిగించిన మగవాడింతవఱకూ వొకడూలేడు దేవా ! మీరుతక్క ! మీపేరు ?" అని అడిగింది. "ఈ మధ్యాహ్నం కలుసుకోలేమనం" అని అంటూ స్వామి తిరోహితులైనారు.

"ఆయన శ్రీకృష్ణభగవానులా ?" అని జవ్వని మర్నాటినుంచీ తన్నుదాను ప్రశ్నించుకుంటూ భిక్షాటనమఱచి ఆ చెట్టుక్రిందే మహాతపస్సు చేసిచేసి తరించింది.

.... .... .... .... ....

# ఆత్మసంస్కారము

"ఇప్పటికో మడతమంచం మనం సంపాయించుకోగలిగాం !" అని అంటూవుంది ఓ అమ్మి తనముందు కోతినెట్టుకుని. అలా అంటూవుంటే—పెంపుడుకోతి అది, బిచ్చగాంద్రకోతి అది,—ఊరికే ఆ మడతమంచం మీదికెక్కి పిల్లిమంతరాలేస్తూ కిందకుదిగుతూ వినోదంకలిగిస్తూవుందా అమ్మికి.